# మాలిన్యం

డి. ఆర్. ఇంద్ర

"నాయనా శంకరం! సాయంత్రం ఆ సంగతి చూడటం మర్చిపోవ్‌గా?"

స్కూలుకి బయలుదేరుతున్న శంకరాన్ని ఇంటి యజమానురాలు సూరమ్మమామ్మగారు పిల్చి గుర్తు చేసింది. "గుర్తు ఉందండి, మర్చిపోను, ఈ రాత్రికి ఆ పని చూస్తాను."అనిచెప్పి సైకిలెక్కాడు. ఆ కొంపలో ఓ చిన్నవాటాలో అద్దెకి ఉంటున్న స్కూల్ టీచరు శంకరం. ఆ పనిమీదే పొద్దుటా, సాయంకాలాలు తెగతిరుగుతున్నా పని జరగడం లేదు. సూరమ్మగారు ప్రతిపూటా అసహనంగా తరుముతూనేఉంది.

"మొగాడివి నీ వల్ల కాకపోతే, ఆడ ముండని వాళ్ళకోసం నేనెక్కడ రోడ్లెక్కి తిరగ్గలనూ?" అంటూ ములుగర్రతో గానుగెద్దుని పొడిచినట్లు సతాయిస్తూనే ఉంది. ఇదేమైనా తన చేతిలో ఉన్న పనా చటుక్కున చేసెయ్యడానికి? అక్కడికీ తన పనులన్నీ మానుకుని ఆ పనిచేసే వాళ్ళని ఎవరో ఒకర్ని తీసుకొస్తూనే ఉన్నాడు. 'అంత కిరాయా?' అంటూ సూరమ్మగారే బేరం కుదరనివ్వడంలేదు. ఆవిడ ఇస్తానన్న కిరాయికి పనిచేసేవాడిని తీసుకురాలేకపోవడాన్ని చాతగానితనం కింద జమకట్టి- "నోట్లో కాస్తంతా నాలుక ముక్క ఉండాలి జనాయించి మాట్లాడటానికి, ఇదేం మొగాడో!" అని వినిపించేలా మాట కూడా జారింది. అందుకు కోపం వచ్చిన శంకరం తనకెందుకొచ్చిన తంటా, అద్దె వాటా ఖాళీ చేసి పోదామా అనుకున్నాడు. కానీ .అద్దెకొంపలకోసం తిరగడంలోని నరకం గుర్తొచ్చి కోపాన్ని దిగమింగుకున్నాడు. పెద్దావిడ ఏదో అంటే మాత్రం, పాఠాలు చెప్పే బడిపంతులైన తనకి కోపం పనికిరాదు అని సర్దుకున్నాడు.

ఏ తాపీ మేస్త్రీనో, వడ్రంగిమేస్త్రీనో, ఎలక్ట్రీషియన్నో అయితే సులువుగా పట్టుకురావచ్చు. కానీ, నిండిపోయిన పాయిఖానా నూతిని తోడి ఖాళీచేసి బయటెక్కడో పారేసే పాకీవృత్తి చేసే మనుషుల్ని పట్టుకురావడం అంత సులువుకాదు. పొద్దుటే వీధుల్లోకి పోయి, వీధులూడ్చే వాళ్ళని పట్టుకోవాలి. వాళ్ళలో కూడా అందరూ ఆ పనిచేయరు. చేసే వాళ్ళెవరో కనుక్కోవాలి. వాళ్ళని ఇంటికి తీసుకొచ్చి పాయిఖానా నూతిని చూపించాలి. సూరమ్మగార్ని పిలవాలి. ఆవిడ వచ్చి ఆమడ దూరంలో నిలబడి బేరమాడుతుంది.

"అమ్మో! అన్ని రూపాయలా? ఇంత చిన్న పనికి?" అంటుంది బుగ్గలు నొక్కుకుంటూ.

"ఆ మాత్రం చిన్నపనైతే మమ్మల్ని పిలవడం ఎందుకమ్మా, మీరే చేసుకోక? మంచిబేరమే తగిలింది పొద్దుటే!" అని విసుక్కుంటూ అతను విసవిసా బయటకు పోయాడు.

"మంచీ, చెడ్డా అక్కర్లేదా? మీరే చేసుకోండి అంటాడా పెద్దంతరం చిన్నంతరం లేకుండా? బ్రాహ్మణ జన్మెత్తి అశుద్ధాన్ని మేమే ఎత్తిపోసుకోవాలి? ఎంత పొగరు? మరీ అంత అన్యాయంగానా అడగటం? పని అన్నాకా బేరం ఉండదా? వీడుకాకపోతే వీడిబాబు మరొకడు చేస్తాడు... ఏం నాయనా శంకరం, అందర్నీ ఇటువంటి పొగరుబోతుల్ని తీసుకొస్తావ్? కాస్త మంచీ మర్యాదా తెలుసున్నవాళ్ళని తీసుకురాక?" ఆవిడ ఆగ్రహం శంకరంపై తిరుగుతుంది.

"ఏదోలా బేరం కుదుర్చుకోవాలి మామ్మగారు. మనం పట్టు విడుపూ లేకుండా పంతం



పడితే పని జరగదు. ఆ పని వాళ్ళే గాని మరొకరు చెయ్యరాయే" అని చెప్పబోయి మానుకున్నాడు శంకరం. ఆవిడ ఎక్కిన కొమ్మ దిగేరకం కాదని తెలుసు. పోనీ ఆవిడ ఇచ్చే కిరాయికే పనిచేసేవాడు దొరికే దాకా ఆ పని వాయిదా వేద్దామంటే కుదరదు. ఆ నుయ్యినిండిపోయి, ఉపయోగించడం చాలా ఇబ్బందిగా ఉంది. ఆ కొంపలోని నాలుగువాటాల జనాలూ నెల్లాళ్ళనుండి చాలా బాధపడుతున్నారు..

పెద్దదొడ్లో లక్కపిడతల్లాటి నాలుగువాటాల పాతడాబా అది. పాయిఖానా దొడ్లు నాలుగూ ఓ మూల సెపరేటుగా ఉన్నాయి. ఆ నాలుగు దొడ్లకు కలిపి నుయ్యిమాత్రం ఒకటే. అద్దెవాటాల్లో ఉన్నవారి చుట్టాలెవరైనా దిగబడితే సూరమ్మగారు ముఖం మాడ్చుకుంటుంది. పాయిఖానా నుయ్యి త్వరగా నిండిపోతుందని! అద్దెకిచ్చేముందే చుట్టాలు ఎవరూ రాకూడదనీ, వచ్చినా రాత్రికి మకాం ఉండకూడదనీ షరతులు పెడుతుంది. అవసరార్థం వాళ్ళు అలాగే అని తలూపినా, ఏ పనిమీదో చుట్టం చూపుగానో కొంపకి వచ్చినవాళ్ళని రాత్రి అవకుండానే తరిమెయ్య లేరుకదా. పొద్దుటే ఆ కొత్త శాల్తీలు దొడ్లోకి వెళ్ళడం చూసి- "మాట నిలబెట్టుకోలేని వాళ్ళు అద్దెకి దిగడం ఎందుకో?" అంటూ ఆ రోజంతా సణుగుతూనే ఉంటుంది. ఆవిడ అలా సణిగినపుడల్లా చైనా దేశం గురించి విన్న ఓ విషయం గుర్తొస్తుంది.

చైనాలో గ్రామీణ ప్రాంతాలలో ఇంటికి వచ్చిన అతిథులు యజమాని ఆతిథ్యం స్వీకరించాకా దొడ్లోకి వెడితే ఆ యజమాని సంతోషిస్తాడట. పశువుల పేడనుండి గోబర్‌గ్యాస్ తయారు చేసి వాడుకుంటున్నట్లే గ్రామీణ చైనీయులు ఇంధనవనరుల ప్రత్యామ్నాయ పద్ధతులలో ఒకటిగా మానవమలంతో తయారయ్యే గ్యాస్‌ని కూడా వంటకు వాడతారట. గ్యాస్ తయారీలో మిగిలిన పిప్పిలాటి పదార్థాన్ని పెరట్లో కూరగాయాల పెంపకంలో ఎరువుగా వాడతారట. ఇంటికి బంధువులొస్తే ముఖం మాడ్చుకునే సూరమ్మగారిని ఓసారి చైనా పంపిస్తే బావుండును అని శంకరం చాలా సార్లు అనుకున్నా పైకి నోరెత్తే ధైర్యం లేదు. సూరమ్మగారి ధర్మమా అని పాయిఖానా నూతులను ఖాళీచేసే రెల్లీలను ఓ డజను మందినైనా సంప్రదించి వాళ్ళకి మహాచెడ్డ లోకువైపోయాడు.

"ఒరేయ్! ఈ మేష్టారింటి మామ్మగారు బేరం కుదర్నివ్వదురా. మీరెళ్ళడం అనవసరం" అని రెల్లీలు ఓ తీర్మానానికొచ్చేయడంతో శంకరం పని ముందుకొస్తే నుయ్యి- వెనక్కొస్తే గొయ్యి అన్నట్లు తయారైంది. శంకరాన్ని చూస్తూనే రెల్లీలు నవ్వుకుంటున్నారు. రోజురోజుకీ పెరుగిపోతున్న సూరమ్మగారి సాధింపులు భరించలేక చివరికి ఓ రోజు స్కూలుకి సెలవుపెట్టి మరో పేటంతా గాలించి వొకణ్ణి పట్టుకున్నాడు. అతను ముందరి వాళ్ళందరికన్నా ఎక్కువ అడిగాడు. ఇతన్ని కూడా వొదులుకుంటే ఆ పని చేయించడం తన వల్ల కాదని గ్రహించిన శంకరం మామ్మగారి బేరానికి ఒప్పుకొమ్మనీ మిగతాది తానిస్తాననీ చెప్పి వొప్పించి ఊపిరి పీల్చుకున్నాడు. కానీ ఆ పనిచెయ్యడానికి అతను రాడట. రాత్రి పది దాటాకా తన కుర్రాళ్ళని పంపిస్తాడట. సగం సొమ్ము ఆడ్వాన్స్‌గా ముందే పుచ్చుకుని వెళ్ళాడతను.

సూరమ్మగారు ఆ సాయంకాలం ఆ పని గురించి శంకరానికి చాలా జాగ్రత్తలు చెప్పింది. ఆ ఎత్తిపోత పని శుభ్రంగా జరగాలట. సగం సగమే ఖాళీచేసి వాళ్ళు మోసగిస్తారట. అందుకని దగ్గరుండి చూసుకోవాలట. అది బయటకు మోసుకెడుతూంటే దొడ్లో ఎక్కడా కిందపడకూడదట. వాళ్ళు దొడ్లో ఉన్న పాదుల్నీ, తులసికోటనీ పొరబాటున కూడా తాక కూడదట. అదంతా జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత అతనిదేనట. వాళ్ళు పనిపూర్తి చేసి వెళ్ళాకా దొడ్లో తులసికోటమీద, దారి పొడవునా, గేటుమీద చిలుకరించమని చెప్పి చెంబుడు పసుపునీళ్ళు కలిపి ఇచ్చింది. వాళ్ళకి అసింటాగా దూరంగా నిల్చోమంది. నీ కసలే మడీ దడీ లేదు, జాగ్రత్త అంది. శంకరం అన్నిటికీ గానుగెద్దులా తలూపాడు.

పాకదొడ్డి నుయ్యి తెరిస్తే వచ్చే దుర్గంధం ఇంట్లోకి చొరబడకుండా అన్ని వాటాల వాళ్ళూ రాత్రి తొమ్మిదింటికే తలుపులూ, కిటికీలూ అన్నీ మూసేసారు. పదకొండు గంటలవుతున్నా ఆ మనుషులెవరూ రాలేదు. ఎడ్వాన్స్ తీసుకుని తన్ను మోసగించాడేమో, మళ్ళా తెల్లారి సూరమ్మగారి చేత చివాట్లు తిని మరొకడికోసం వేట మొదలు పెట్టాలేమోనని భయం వేసింది. వాళ్ళ కోసం ఎదురు చూసి చూసి ఇంకరారు, పడుకుందాం అనుకుంటున్న శంకరానికి వంటిగంటకి గేటు

